విశ్వసాహితి:

# సైమను తెచ్చుకున్న నాన్న

మూలం: మపాసా ★ అనువాదం: శ్రీమతి జానకీరాణి

మధ్యాహ్నమైంది. బడి విడవగానే సైమను బైటకు వచ్చేశాడు. తల వంచుకొని ఇంటివైపు నడవసాగాడు. వెనకాల కొందరు పిల్లలు నవ్వుకోడం వినిపించి తిరిగి చూశాడు. అందరూ మాటలాపేసి వింతగా చూశారు. మళ్ళీ చకచక నడవటం మొదలెట్టాడు. మళ్ళీ గుసగుసలు!

"వాడే సైమన్. వాడికి నాన్న లేడు."

"అరె లేడూ?"

మళ్ళీ వెనక్కి తిరిగి చూశాడు సైమను. ఎనిమిదేళ్ళ పిల్లవాడొకడు సైమనువంక తీక్షణంగా చూస్తూ "ఆగు" అన్నాడు. మిగిలిన పిల్లలంతా వాడివంక గొప్పగా చూశారు. ఎందుకంటే సైమనుతో మాట్లాడడం సామాన్యమైన పని కాదు. దానికి చాలా సాహసం కావాలి. సైమనుతో మాట్లాడితే తల్లిదండ్రులు చంపేస్తారు పిల్లల్ని. చిన్నతనంనుంచీ ఎవరి స్నేహం ఎరుగడు సైమను. పిల్లలందరికీ వాణ్ణి చూస్తే భయం.

సైమనుని పిలిచినవాడితోపాటు పిల్లలంతా చుట్టుగెట్టుకొచ్చారు. ఇంతమందిని చూసేసరికి సైమను ముఖం పాలిపోయింది. బడి వచ్చిన మొదటిరోజే ఇది జరగటంతో వాడు మరింత భయపడ్డాడు.

"నీ పేరేమిటి?" అన్నాడా పెద్దవాడు.

"సైమను." అంతా నవ్వారు.

"సైమనా? ఏం సైమను?"

"సై-మన్."

"ఊరికే, సైమనంటే? అదేం పేరు? ఇంకేమైనా వుండాలి" అన్నాడా పిల్లాడు.

సైమను భయంతో బిక్కముఖం వేశాడు.

"నా పేరు సైమను. అదే నా పేరు" అన్నాడు.

పిల్లలంతా ఘొల్లున నవ్వారు. సైమను కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. అందర్నీ తప్పించుకుని బైటికి రావడానికి ప్రయత్నించాడు. అందర్లోకీ పెద్ద కుర్రాడు వాడిని ఆపాడు.

"ఓరేయి, నీకు నాన్న లేడు కదూ?" సైమను బావురుమన్నాడు. వాడి హృదయం తల్లడిల్లిపోయింది యీ అవమానానికి.

"ఉన్నాడు-ఉన్నాడు."

"ఎక్కడున్నాడు?" సైమనుకిది తెలియదు. ఒకటే సులభంగా కనుపించింది.

"చచ్చిపోయాడు." సైమను కొద్దిగా బలం చేకూర్చుకున్నాడు. "ఔను. చచ్చి స్వర్గంలో వున్నాడు."

సైమనుని నిలవేసిన కుర్రాడికిది అబద్ధంగా తోచింది.

"అబద్ధం! అంతా అబద్ధం! వీడికి అసలు నాన్న లేడురా" అంటూ చప్పట్లు కొట్టాడు. పిల్లలంతా అరిచారు. సైమను కోపం పట్టలేక ఆ కుర్రాడితో కలియబడ్డాడు. పదిమంది కుర్రాళ్ళు కలిసి సైమనుని చితక తన్నారు. "పో! నీ బాబుతో చెప్పుకో" అని వాణ్ణి త్రోసేశారు.

-సైమను మెల్లిగా వంకర రోడ్డుమీద నడవసాగాడు. వెనకనుంచి పిల్లల కేకలు వినిపించి వాడికి పుట్టెడు దుఃఖం వచ్చింది. కానీ ఇంతలో ఏదో మొండిధైర్యం చేకూర్చుకున్నాడు. రోడ్డుకి ప్రక్కగా చెరువుంది. ఆ మధ్య ఒకడు దానిలో మునిగి చచ్చిపోయాడు. దుఃఖం భరించలేక చచ్చిపోయాడని చెప్పుకున్నారు. తనుకూడా బాధలో వున్నాడుగా! చచ్చిపోతే మేలు అనుకున్నాడు. చెరువుగట్టున కూర్చుని సైమను ఒక్కక్షణం అమ్మని తలచుకున్నాడు. అమ్మ తనని హృదయానికదుముకుని కన్నీళ్లు కార్చడం వాడెరుగున్నాడు. తను ఒక్క నిముషం కనుపించకపోతే అమ్మ కంగారుపడడం వాడికి తెలుసు. తను చచ్చిపోతే ఇంకెంత ఏడుస్తుందో? ఈ ఆలోచనతో సైమనుకి మళ్ళీ ఏడుపు పొంగి పొర్లుకొచ్చింది.

సైమను కన్నీటిబొట్లు ఒకొక్కటే పచ్చని గడ్డిమీద పడకొచ్చాయి. ఎండలో గడ్డి మెరుస్తోంది. చెరువు నిర్మలంగా వుంది. చేప ఒకటి పైకి ఎగిరి సూర్యకాంతిలో మిలమిలలాడింది. సైమనుకిది అద్భుతంగా కనుపించింది. తన జేబులోని గులకరాళ్ళు ఒక్కొక్కటే నీటిలో వేయసాగాడు.

"ఈ చేపలు ఎంత సుఖంగా బ్రతుకుతాయి? వీటికి నాన్న ఉన్నాడా?" అన్న ఆలోచన వచ్చింది వాడికి. ఉండేవుంటాడు. తనొక్కడే దౌర్భాగ్యుడు ప్రపంచంలోకల్లా. సైమను వెక్కి వెక్కి ఏడ్చాడు.

"ఎందుకు నాన్నా ఏడుస్తున్నావు?"

బలమైన చెయ్యి ఒకటి సైమను భుజంమీద పడింది. సైమను వెనక్కి తిరిగి చూశాడు. పొడుగ్గావున్న పెద్దమనిషి తన వంక జాలిగా చూస్తున్నాడు. అతని కళ్ళు విశాలంగా వున్నాయి. అతని జుట్టు వుంగరాలు తిరిగి నుదుటిమీద పడుతోంది.

ఈ లాలనతో సైమను గొంతు పూడుకుపోయింది. "వాళ్లు కొట్టారు నన్ను.... నాకు నాన్న లేడని."

అతను చల్లగా నవ్వాడు. "అందరికీ నాన్న వుంటాడుగా? నీ కెందుకు లేడు?"


సైమనుకిది మరీ అన్యాయంగా కనుపించింది. "నాకు లేడు."

అతను గ్రహించాడు సైమను ఎవరి బిడ్డడో. పొడుగుగా వున్న అందమైన స్త్రీ లాబ్రాంచెక్ [illegible] వుంటాడు వాడు. ఆమెని గురించి అతనికి కొద్దిగా తెలుసు. "పద నాయనా ఇంటికి. మీ అమ్మ ఇస్తుందిలే నీకు నాన్నని."

ఒక అందమైన పురుషుణ్ణి వెంటబెట్టుకుని తన కొడుకు రావడం చూసింది లాబ్రాంచెక్. ఆమె చిన్నతనంలో ఒక యువకుణ్ణి నమ్మింది. అతను మోసగించి వెళ్ళిపోయాడు. ఆ మైత్రి ఫలం సైమను. ఆనాటినుంచి ఆ పల్లె ప్రజలంతా ఆమెను వెలివేశారు. పసివాడి హృదయానికి కష్టం కలక్కుండా కాపాడుకుంటూ వస్తోందామె.

"అమ్మా!" అమాంతం వచ్చి కాళ్ళకి చుట్టుకున్న పిల్లాడిని ఆమె ఎత్తుకుంది. విస్మయంగా చూసే ఆమె కళ్ళు, పెద్ద జుట్టు చూసి యువకుడు తడబడ్డాడు.

"మీ అబ్బాయి.......అక్కడ ఏడుస్తూ కూర్చున్నాడు వెంట తీసుకొచ్చాను. ఎందుకేడుస్తున్నాడో కనుక్కోండి......"



# ఆలయప్రాంగణం

పైపు చిత్రం :
శ్రీ జి. సుబ్రహ్మణ్యం

సైమను మళ్ళీ ఏడుపు ఆరంభించి తల్లి గౌను కొంగు పట్టుకొని లాగాడు.

"అమ్మ, నామ్మా, నే నూరికే ఏడవలేదు. వాళ్ళంతా నన్ను కొట్టారు. నేను చెరువులో పడి చచ్చిపోదామనుకున్నాను....అమ్మా! నాకు నాన్న లేడని వాళ్ళు నన్ను కొట్టారు!"

పిల్లవాడి మాటలకు లాంగ్మాం చెట్ ముఖం ఎర్రబడింది.

"నా తండ్రి ఏడవకు బాబూ!" అంటూ సముదాయించి ఓదార్చిందే కాని ఆమె కళ్ళనుండి అశ్రువులు ప్రవహించసాగాయి. యువకుడు తల వంచుకున్నాడు. అతని హృదయం ద్రవించింది ఆమె వ్యథను చూసి. సైమను తల్లి చంక దిగి యువకుని వద్దకు పరుగెత్తుకొచ్చాడు.

"ఏమండీ, మీరు నాకు నాన్నగా వుండరూ?" అన్నాడు. లాంగ్మాం చెట్ ముఖం సిగ్గుతో ఎర్రబడింది. "సైమన్!" అని పిల్లవాడిని వారింపబోయింది.

యువకుడు తల భూమిలోకి దించేశాడు. "అలాగా, ఒప్పుకోక పోతే నేను చెరువులో మునిగిపోతాను" సైమను బెదిరించాడు.

"అల్లాగే వుంటాను" అంటూ వెనక్కి తిరుగబోతున్న అతన్ని పట్టుకున్నాడు సైమను.

"మీ పేరేమిటో చెప్పండి. వాళ్ళకు చెప్పాలి నేను. వెధవల గర్వం కుదురుస్తాను"

"నా పేరా? ఫిలిప్!" సైమనుకు బ్రహ్మానందం కలిగింది.

"సరే ఫిలిప్ గారూ ఇకనుంచి మీరు మా నాన్నగారు" అంటూ ఫిలిప్ చేతులు పట్టుకుని వూగాడు వాడు. ఫిలిప్ కు పసివాని అమాయకత్వం చూసి జాలేసింది. వాణ్ణి ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు.

మర్నాడు సైమను బడికి పోగానే నిన్నటి అల్లరే ప్రారంభమైంది.

"నాకూ నాన్న వున్నాడు. సైమన్ ఫిలిప్ నా పేరు. మా నాన్న పేరు ఫిలిప్" పిల్లలందరికీ ఇది నచ్చింది. సైమనును గేలిచేయడం మాని కలసి మెలసి తిరుగసాగారు.

తర్వాత గడిచిన రెండు నెలల్లో ఫిలిప్ రోజూ సైమను యింటికి వెళ్ళేవాడు. సైమనుని తన భుజాలమీద కెక్కించుకుని చెరువు గట్టుకు తీసుకువెళ్ళేవాడు. పిల్లాడిమీద ప్రేమ తప్ప వేరేభావం లేకపోయింది ఫిలిప్ కి. సైమను లేని వేళల్లో ఫిలిప్ వెళ్ళినా లాంగ్మాం చెట్ ను కన్నెత్తి చూసేవాడు కాదు. ఆమె గుమ్మం వెనకనుంచి సమాధానం చెప్పేది. సైమను కల్పించిన ఈ బాంధవ్యాన్ని సంఘం ఎలా అర్థం చేసుకుంటుందో నని ఆమె హృదయం తల్లడిల్లిపోయింది. "నాన్న నన్నెత్తుకున్నాడు. మిఠాయి పెట్టాడు" ఇలా సైమను అమాయకంగా చెబుతుంటే లాంగ్మాం చెట్ రక్తం గడ్డకట్టుకు పోయేది. పద్ధం టే సైమను అన్నం మానేసి చెరువుకెటుకు పోతుంటాడు. ఇరుగుపొరుగులో అప్పుడే గుసగుసలు ప్రారంభమైనాయి. కానీ లాంగ్మాం చెట్ ఎంతో గుట్టుగా వుండసాగింది. ఫిలిప్ ఇంటికి రాకుండా స్కూలుకే పోయేటట్లు కట్టుదిట్టం చేసింది.

మొదట్లో సైమనును తిన్నని పిల్లాడు ఒక సాయంకాలం ఒంటరిగా కనిపించాడు. వాడు నవ్వుతూనే సైమనును పిక ప్రశ్నిస్తున్నాడు. "ఒరేయి. నువ్వు అబద్ధం చెప్పావు కాదు గాని మీ నాన్న ఫలికే అనేవాడు ఎక్కడున్నాడు రా?"

(మిగతా రవవ పేజీలో)

# సైమను తెచ్చుకున్న నాన్న

(31 వ పేజీ తరువాయి)

సైమను భయపడలేదు. "ఉన్నాడు,"

"కావాలంటే చూపిస్తాను."

"అది కాదురా వెర్రినాగన్నా. మీ నాన్న అయినవాడు మీ అమ్మకు భర్త కావాలి." ఫిలిప్ కాదుగా." సైమను మాట్లాడలేదు. ఈ ఆలోచన వానిని పీడించింది. సరాసరి ఫిలిప్ పనిచేసే ఫ్యాక్టరీకి వెళ్ళాడు వాడు. మిట్టమధ్యాహ్నం సైమను రావడం ఫిలిప్‌కు అర్థం కాలేదు.

"నువ్వు నాకు నాన్నవి కాదటగా?"

ఫిలిప్ నవ్వాడు "ఏం బాబూ?"

"మైకేలు చెప్పాడు. మా నాన్న అయినవాడు మా అమ్మకు ఏం కావాలి." పిల్లాడికేమి సమాధానం చెప్పాలో తెలియక తల వంచుకున్నాడు.

"చెప్పు ఫిలిప్. నువ్వు నాకు నాన్నవి కాదా?" ఫ్యాక్టరీలో ఫిలిప్ స్నేహితులు అతని ప్రక్కకు వచ్చారు. ఫిలిప్ ఆలోచనలో మునిగిపోయాడు. అతని ముఖంమీద విషాదచ్ఛాయలు క్రమ్ముకున్నాయి. ఆఖరికి అతని స్నేహితుల్లో ఒకడు తెగించి మాట్లాడాడు.

"లాబ్లాంచెట్ చాలా మంచిది. పాపం. పిల్లాడి చదువుకోసం చాల తంటాలు పడుతోంది." రెండో స్నేహితుడు అందుకున్నాడు.

"ఎవరికైనా వస్తుంటాయి పొరపాట్లు. ఆ దుర్మార్గుడెవడో చేసిన దానికి ఆవిడేం చేస్తుంది?"

"అందరూ తనవలా ఆడిపోసుకుంటూంటే ఆవిడ ఎంత బాధపడుతోందో? ఆమెను ఆదరించేవాళ్ళు లేరు."

ఫిలిప్ కళ్ళవెంట రెండు కన్నీటిబొట్లు రాలి భూమిలో ఇంకిపోయాయి. మసి చేత్తో తుడుచుకొని పని ప్రారంభించాడు.

"మీ అమ్మతో మాట్లాడడానికి వస్తానని చెప్పు. వెళ్ళు ఫిలిప్!"

బాగా చీకటిపడిన తర్వాత ఫిలిప్ తేలికైన హృదయంతో లాబ్లాంచెట్‌ను చూడడానికి వెళ్ళాడు. నక్షత్రాల కాంతిలో, మబ్బుని లాబ్లాంచెట్ యోచనా మగ్నురాలైంది. అకస్మాత్తుగా ఫిలిప్ రావడంతో ఆమె తత్తరపాటు చెందింది. భయంగా చూసే ఆమె చంచల నయనాలు ఎంతో సుందరంగా కనుపించాయి ఫిలిప్‌కు. సూటిగా చెబుదామని వచ్చాడతను. కానీ మాటలు దొరక లేదు.

చివరికి లాబ్లాంచెట్ ఉపక్రమించింది. "చూడండి. ఇంత రాత్రి మీరు రావడం అట్టే బాగుండలేదు. మీరేదైనా చెప్పదలిస్తే వీలైనంత త్వరగా కానివ్వడం మంచిది. సైమను కూడా నిద్రపోతున్నాడు."

కొంత ధైర్యం చేసుకున్నాడు ఫిలిప్.

"ఊరంతా ఈ...బాంధవ్యాన్ని ఎల్లా అనుకుంటున్నారో మీరు వినే...." లాబ్లాంచెట్ వాక్యం త్రుంచేసింది.

"తెలుసు. వాళ్ళనుకునేది సత్యం కాకపోయినా ఇల్లా జరగడం మర్యాద కాదు. ఇది అరికట్టాలని మీకు చెబుదామనుకుంటున్నాను. సైమనుతో మీరు స్నేహం మానడం సర్వవిధాలా శ్రేయోదాయకం."

"అదే నా ఉద్దేశం. మీరు తొందరపడి నన్ను అపార్థం చేసుకోకండి. మీకెవరూ 'నా' అనేవాళ్ళు లేరు. మనిషన్నవాడు ప్రేమ, ఆదరం కోరుకుంటాడు. ఇంత ఒంటరిగా, రక్షణ లేకుండా గడపడం మీకు కష్టం...... మీరేదో మహాపరాధం చేశానని భ్రమలో పడుతున్నారు. మన సంఘంలోని వాళ్ళంతా కాకుల్లాంటివాళ్ళు న్యాయాన్యాయాల విచక్షణ లేదు వాళ్ళకు. ఒకరి తప్పులకు మరొకరు శిక్ష ననుభవించడం సమంజసమేనా? మీరేం చేస్తారు ఎవరో చేసిన దౌర్జన్యానికి....నాకు వివాహం...." లాబ్లాంచెట్‌కి అంతా అర్థమైంది.

"ఆగండి. మీరు చెప్పేది నాకు తెలుసు. కానీ ఫిలిప్, లోకం పోకడ మీకు తెలియదు. మీరు చెప్పదలుచుకున్నది ఆచరణలో చాలా కష్టం. ఈ నిందలకు, విమర్శలకు తట్టుకోలేరు మీరు. నా జీవితం ఎల్లాగూ నాశనమైంది. లోకం దృష్టిలో నేను నీచురాలిని. పండంటి మీ బ్రతుకును ఎందుకు పాడుచేసుకుంటారు? నా పిల్లాడు నేను ఒకరికొకరు ఆధారంగా బ్రతుకకపోం. మీరు చేయబోయేది నాకు సౌఖ్యం కలిగించదు......" ఫిలిప్ వినలేకపోయాడు.

"మీ కర్థం కావడంలేదు. నేను మీకంటే ఏవిధంగానూ ఎక్కువ కాదు......"

తెల్లవారుఝామున సైమను నిద్రలేచాడు. తల్లి ఏడుస్తుంటే ఫిలిప్ ఓదార్చడం చూశాడు వాడు. దబాలున వెళ్ళి తల్లిని కౌగలించుకున్నాడు.

"ఎందుకే అమ్మా?"

ఫిలిప్ సైమనును తల్లినుండి లాగి ఎత్తుకున్నాడు. "ఊరుకోవే. రేపు నువ్వు బడికి వెళ్ళి ఫిలిప్ నా తండ్రి అని చెప్పు."

సైమను ఆనందంతో చప్పట్లు కొట్టాడు. "నిజమేనే అమ్మా?"

లాబ్లాంచెట్ కళ్ళు తుడుచుకొని ఫిలిప్ వంక చూచింది. ఎంతో కృతజ్ఞత ప్రస్ఫుటిస్తోంది ఆమె కళ్ళలో. "నిజమే బాబూ."

తెల్లారి బళ్ళో అందరికీ చెప్పాడు సైమను ఈ సంతోషవార్తను. పిల్లలకు ఈర్ష్య కలిగింది వాళ్ళే మాస్తే—ఎందుకంటే ఫిలిప్ లాంటి నాన్నను ప్రపంచంలో అందరూ కోరుకుంటారని వాళ్ళ ఊహ. ★

